క్లుప్తంగా

పట్టణంలో పింఛన్ పంపిణీ



పిడుగురాళ్ల : పట్టణంలో 1వ తేదీ ముమ్మరంగా వలంటీర్లు పింఛన్ పంపిణీ చేపట్టారు. ఉదయానే 6 గంటల కల్లా ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ అందే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన విధంగా పట్టణంలోని 17 సచివాయాల, 33 వార్డు వలంటీర్లు, కౌన్సిలర్లు, గృహసారధులు అందరు కలిసి ఇంటికి తలుపు తట్టి పింఛన్ పంపిణీ చేశారు.

గ్రామ విత్తన ఉత్పత్తిపై రైతులకు శిక్షణ



పిడుగురాళ్ల: మండలంలోని పందిటివారిపాలెం, గుత్తికొండ గ్రామాల్లో గ్రామ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 50 శాతం రాయితీపై రైతులకు వరి విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బీవీ శివకుమారి, ఏఓ పి. ప్రవీన్, నందిపాటి పిడుగురాళ్ల ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు విజయభాస్కర్, సాగర్, జ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాల తనిఖీ

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాల్ తనిఖీ చేశారు. పాఠశాలలో 9,10వ తరగతి గదులను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా బోధించే తీరు పరిశీలించారు. పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక పంపిణీపై ఆరా తీశారు. పాఠ్యప్రణాళిక, డైరీలను పరిశీలించారు. ఫార్మేటివ్ అసైన్‌మెంట్ వన్ పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. అదే విధంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఎం. సుభానీ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి టేక్ హోమ్ రేషన్ విధానం ప్రారంభం

శావల్యాపురం: అంగన్‌వాడీ సెంటర్లలో టేక్ హోమ్ రేషన్ విధానం (ఇంటి తీసుకొని వెళ్లే విధానం) బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలలితా మంగళవారం తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

ఈపూరు: కౌలు రైతు కార్డుల కోసం ఈ నెల 7వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి రామారావు కోరారు. ఎస్సీ, ఎ స్టీ, బీసీలు భూమి లేకపోయినా కౌలు రైతు కా ర్డులు పొందవచ్చని, అయితే వారికి భూమి ఇచ్చే యజమానికి 2.50 ఎకరాలు ఉండాలని తెలిపారు. 2060 కౌలు రైతు కార్డులు టార్గెట్ ఉండ గా ఇప్పటికి 1298మంది కౌలు రైతులు కార్డులు పొందారని మరో 762 కౌలు రైతు కార్డులు పొందేందుకు అవకాశం ఉందని ఆయనపేర్కొన్నారు.

నర్సరీలకు అనుమతి తప్పనిసరి

నాదెండ్ల: నర్సరీ యజమానులు అనుమతులు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఎస్.కిషోర్‌కుమార్ కోరారు. చిరుమామిళ్ల గ్రామంలో వ్యవసాయ షేడ్‌నెట్ నర్సరీలను స్థానిక వ్యవసాయశాఖ అధికారి ఎ.హరిప్రసాద్‌తో కలసి తనిఖీ చేశారు. నర్సరీ యజమానుల అనుమతులు పరిశీలించి రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదోనని తనిఖీ చేశారు. రైతులకు అందించే మిర్చి నారు నాణ్యమైనదిగా ఉండాలని, అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను ఎంచుకోవాలన్నారు. చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. నర్సరీ యజమానుల దగ్గర నారు తీసుకున్నపుడు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసి నర్సరీ యజమానులకు ఇచ్చినపుడు రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. వారితో పాటూ గ్రామ ఉద్యానవన సహాయకులు సుబ్బారావు ఉన్నారు.

వృద్ధుడిపై దాడి

నరసరావుపేట టౌన్: వృద్ధుడిపై నలుగురు యువకులు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన పసుపులేటి సత్యనారాయణ 60 అడుగుల రోడ్డు దాటుతుండగా ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ప్రభాకర్ ఢీకొట్టాడు. నిర్లక్ష్యంగా వాహనం నడపడంపై సత్యనారాయణ ప్రశ్నించడంతో ప్రభాకర్, అతని ముగ్గురు స్నేహితులతో కలసి దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : సంక్షేమ పథకాల రథసారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతుందని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే కాసు నిర్వహించారు. వార్డు పరిధిలో ఉన్న ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాసు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు ప్రభుత్వం పనితీరును అభినందించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాసు అందించారు. 20వ వార్డులో ఉన్న పలు సమస్యలను నాయకులు ఎమ్మెల్యే కాసు దృష్టికి తీసుకురావడంతో సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ఈ రోజు రాష్ట్రంలో ఇంటి వద్దకే పింఛన్, ఇంటి వద్దకే రేషన్...ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం మన అందరి ప్రభుత్వమని, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, విద్యా కానుక, వసతి దీవెన పథకాలు విద్యార్థులకు వరంగా మారాయన్నారు. డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని, వైఎస్సార్ ఆసరా..వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నావడ్డీ జగనన్న తోడు పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించిన ఘనత మన ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే కాసు తెలియజేశారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనాలో 95 శాతం హామీలను అమలు చేశామని ఆయన చెప్పారు. రూ.3.50 కోట్లతో రైల్వేస్టేషన్ రోడ్డుని అభివృద్ధి చేస్తున్నామని, నగర పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధితో తీర్చిదిద్ది ఆదర్శ పట్టణంగా మారుస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకునేలా పనిచేస్తామని ఎమ్మెల్యే కాసు అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌భాషా, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్ కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్ హుస్సేన్, మండల కన్వీనర్ కోట కృష్ణ, వార్డు ఇన్‌చార్జీ ముశ్యం వెంకటేశ్వర్లు, వార్డు కన్వీనర్ షేక్ మౌలాలీ, వేముల శ్రీహరి, నాయకులు ముశ్యం శ్రీనివాసరావు, ఉప్పల రామాంజనేయులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష...

నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమీక్షించారు. నగర పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. రైల్వేస్టేషన్ రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధించి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల గురించి కూడా ఎమ్మెల్యే సమీక్ష జరిపారు.

అభివృద్ధి పనులకు సమష్టిగా కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బూడిద మంగమ్మ

మాచర్ల రూరల్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నిర్వాహణ పై అన్నీ శాఖాధికారులు సమష్టిగా పనిచేసి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎంపీపీ బూడిద మంగమ్మ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల తీరు పై ఆమె సమీక్షిస్తూ గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల్లో ఎన్ఆర్‌జీహెచ్ ఎంతో కీలకమని, అవసరమైన పనులను గుర్తించి వెంటనే చేపట్టాలని సూచించారు. అలాగే పంచాయతీ నిధుల విషయంలో ఆయా కార్యదర్శులు, సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, విద్యా, వైద్యం, రహదారుల విస్తరణ, గృహ నిర్మాణాలపై ఆయా అధికారులతో ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి, బూడిద శ్రీనివాసరావు, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రంగానాయక్, సర్పంచ్‌లు, ఆయా శాఖాధికారులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతిర్యాలీ



కేసానుపల్లిలో ర్యాలీ చేస్తున్న స్థానికులు



సమావేశంలో పాల్గొన్న క్రైస్ట్ పల్నాడు పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

దాచేపల్లి : మణిపూర్ హింసఖండ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం శాంతిర్యాలీ నిర్వహించారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో పాస్టర్ గనుపల్లి శ్యామ్ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో సంఘస్తులు, సండేస్కూల్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. మణిపూర్ ఘటనకు కారణమైన వ్యక్తులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేయడం. మహిళలను వివస్త్రను చేసి ఊరేగించడం దుర్మార్గమైన చర్యలని, చర్చిలను కూడా ధ్వంసం చేయడం మంచి విధానం కాదని పాస్టర్ శ్యామ్ ప్రసన్నకుమార్ అన్నారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, సంఘ పెద్దలు వినుకొండ సుధీర్‌కుమార్, వినుకొండ యాకోబు, వినుకొండ వజ్రం, శ్రీపతి లింగయ్య, మీసాల ఇర్మియా, మీసాల ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి

మాచర్ల: మణిపూర్ రాష్ట్రంలో మహిళల పై జరిగిన అకృత్యాలు పునరావృతం కాకుండా అక్కడి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని క్రైస్ట్ పల్నాడు పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం సమావేశంలో వారు మాట్లాడుతూ క్రైస్తవుల పై దాడులు జరగడం బాధాకరమన్నారు. ఇటువంటివి జరగకుండా ఉండాలని ప్రార్థనలు నిర్వహించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సర్జన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ దాసు, టౌన్ ప్రెసిడెంట్ రవిబాబు, నియోజక వర్గం ట్రెజరర్ పీటర్ పాల్, గౌరవ అధ్యక్షులు చంద్రపాల్, నియోజక వర్గ జాయింట్ సెక్రెటరీ కుక్కమూడి వెంకయ్య తదితరులున్నారు.

ముగిసిన కొండవీడు రెవెన్యూ రీసర్వే ప్రక్రియ



చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

యడ్లపాడు: వైఎస్సార్ జగనన్న భూహక్కు–భూరక్ష కార్యకమంలో భాగంగా మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో రీసర్వేకు సంబంధించిన రైతులకు 9(2) నోటీసులు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొండవీడు రెవెన్యూ పరిధిలో సుమారు 950 సర్వే నంబర్లలో మూడు నెలల పాటు రీసర్వే ప్రక్రియ కొనసాగిందన్నారు. ఆయా సర్వే నంబర్లలో కొలతలు నిర్వహించి రెవెన్యూ పరిధిలోని రైతులకు 9(2) నోటీసులను అందజేశామని, ఈ నోటీసుల్లో రైతుకు ఏ సర్వే నంబర్‌లో ఎంత విస్తీర్ణం కలిగిన భూమి ఉందో ఆ భూములకు కొత్తగా ఇచ్చిన ల్యాండ్ పార్సిల్ నంబర్‌లను తెలియజేయడం జరిగిందన్నారు. సదరు నోటీసులను చదువుకుని వాటిలో హద్దులు, విస్తీర్ణం ఇతరేత్ర అభ్యంతరాలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లేదా మొబైల్ మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకుని సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. ఇదే వేదికపై అందజేసినట్లు వెల్లడించారు. సభలో పీఏసీఎస్ చైర్మన్ బసెల శివరామకృష్ణ, ఆర్ఐ చక్రవర్తి పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ మహాసభలకు ఉద్యోగులు తరలిరావాలి

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర మహాసభలకు జిల్లాలోని ఉద్యోగులు భారీగా తరలిరావాలని తాలూకా అధ్యక్షుడు మర్లపాటి రామకష్ణ కోరారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. రామకష్ణ మాట్లాడుతూ విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22తేదీల్లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ బైలాకు సంబంధించి కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందని చెప్పారు. తాలూకా కార్యదర్శి మాదాసు ఆనంద్ మాట్లాడుతూ సభల జయప్రదానికి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళా అధ్యక్షులు అనూరాధ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగుల కోసం వసతి ఏర్పాట్లు కూడా చేశామన్నారు. కార్యక్రమంలో తాలూకా కోశాధికారి చింతకుంట కోటిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు డీవీడీ ప్రసాద్, నారాయణ, కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి శ్యామల, మాణిక్యమ్మ, సీనియర్ సభ్యులు సాంబశివరావు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరం

సీడీపీఓ షేక్ రుక్సానా సుల్తానాబేగం

గురజాల : తల్లిపాలు పుట్టినబిడ్డకు ఆరోగ్యకరమని సీడీపీఓ షేక్ రుక్సానా సుల్తానాబేగం అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టినబిడ్డకు తల్లి ముర్రుపాలు బిడ్డకు అందించాలన్నారు. పుట్టిన బిడ్డకు పాలు అందిస్తే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నకుమారి అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

స్మైల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల



గురజాల : స్మైల్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో స్మైల్ ఫౌండేషన్ సేవలు నిలుపుదల చేయలేదని క్లిష్ట పరిస్థితుల్లో కూడా సేవలు అందించడం మంచి ఆలవాటన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో తలపెట్టి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాధం, బండి రవికుమార్, చింతపల్లి ఏడుకొండలు తదితరులున్నారు.

నేటి నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం

కారెంపూడి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ జి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కారెంపూడి గ్రామ సచివాలయం– 2లో ఉదయం 11 గంటలకు ప్రారంభ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం వారి ఇంటికే పోషకాహార కిట్స్‌ను ఈ కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గతంలో వారు పోషకాహార కిట్స్ కోసం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లేవారని ఇప్పుడు ఆ అవసరం లేకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి వారికి ప్రభుత్వం పంపిన పోషకాహార కిట్స్‌ను అందించనున్నట్లు పేర్కొన్నారు.

మానసిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

నరసరావుపేట ఈస్ట్: చిన్నారులు, పెద్దలలో పెరుగుతున్న మానసిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. పాతూరులోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం భవిత పాఠశాలను మంగళవారం సందర్శించారు. మానసిక దివ్యాంగులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. నేడు సామాజిక పరిస్థితులలో చిన్నారులతో పాటు పెద్దలలో కూడా మానసిక సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా ఆయా సమస్యలపై అవగాహనతో వాటిని అధిగమించాలని, లేని పక్షంలో మానసిక రుగ్మత పెరుగుతుందన్నారు. ఆందోళన కలిగిన సమయంలో సకాలంలో వైద్యులను సంప్రదించి మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని సూచించారు. మానసిక సమస్యల నిర్మూలనకు తమ సంస్థ పనిచేస్తున్నదని వివరించారు. మానసిక దివ్యాంగులతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు జి.మేరికుమారి, ఎస్.పద్మజా పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన సింగరుట్ల తండా వాసులతో ప్రభుత్వ విప్ పీఆర్కే

కారెంపూడి: పేదల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రగతి కోసం వైఎస్సార్‌సీపీని బలపర్చాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కారెంపూడి మండలం పేటసన్నెగండ్ల గ్రామ శివారు రోడ్డు మీద ఎస్సీ కాలనీ, అలాగే సింగరుట్ల తండాకు చెందిన ఐదు కుటుంబాలకు చెందిన వారు వారి మద్దతు దారులు మంగళవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికి ప్రభుత్వ విప్ పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్సీ కాలనీకి చెందిన కుమ్మ ఆంధ్రయ్య, కుమ్మ అన్నమ్మ కుటుంబాలు అలాగే సింగరుట్ల తండాకు చెందిన రమావతు బాలునాయక్, రమావతు బర్మా నాయక్, రమావతు కోట నాయక్ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను నాయకులను చాలా ప్రేమగా చూచుకుంటారని వారికి ఏ కష్టం వచ్చినా ఎమ్మెల్యే వారిని ఆదుకుంటున్న తీరు ఆయన సమర్థ నాయకత్వం నచ్చి పార్టీలో చేరామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీల కతీతంగా అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ ఇది తరతమ భేదాలు చూడకుండా ప్రజలందరి బాగుకోసం శ్రమిస్తున్న ప్రభుత్వ మని వైఎస్సార్ సీపీ బలోపేతం అయితే పేదల అభ్యున్నతి మరింతగా సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గురజాలకు సహకరించాలి

రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల



పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బండ్లను పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్

గురజాల : స్వచ్ఛ గురజాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీలో మంగళవారం చెత్త రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త బండి వచ్చిన సమయంలో చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. చెత్త వాహనాలు ప్రతి రోజు గ్రామంలో ప్రతి ఇంటికి వస్తాయన్నారు. స్వచ్ఛ గురజాల పురస్కారం వచ్చే విదంగా ప్రతి ఒక్కరు విధిగా చెత్తను రోడ్లపై వేయకుండా ఉండాలన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్ పర్సన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్, షేక్ నాసర్‌సైదా, వేలమూరి సైదారెడ్డి, తిప్పులూరి కోటిరెడ్డి, తదితరులున్నారు.

మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మరియబాబు



మరియబాబుకి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం మండల శాఖ అధ్యక్షుడిగా మండలంలోని ముత్యాలంపాడుకి చెందిన బాసిపోగు మరియబాబు నియమితులైయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మరియబాబుకి నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు వివరించాలని, ఎస్సీలకు జరుగుతున్న మేలును తెలియజేయాలని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ఎస్సీసెల్ అధ్యక్షుడిగా నియమితులైన మరియబాబును జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, సర్పంచ్ నెమలి కొండ వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, నాయకులు గొట్టిముక్కల వెంకటరెడ్డి తదితరులు అభినందించారు.

సచివాలయ మహిళా పోలీస్ సమస్యల పరిష్కారానికి కృషి

మాచర్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థలో రూపొందించిన మహిళా పోలీసు వ్యవస్థ అనేది ఎవరు కనివినీఎరుగని రీతిలో మహిళా సాధికారత, శిశు సంరక్షణ ప్రాథమిక ధ్యేయంగా రూపొందించడం జరిగిందని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ పీఆర్కేను మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల్లో ఎంతో ధైర్యాన్ని నింపిందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీసులు ఎన్నో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన వవరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తూ పోలీసు వారికి తమ వంతు సహకారాన్ని అందించడంతో పాటు వారి విధుల్లో భాగస్వాములు అవ్వడం జరిగిందన్నారు. మహిలా పోలీసు వ్యవస్థకు వ్యతిరేక వాదనలు వినిపిస్తున్నప్పటికీ సీఎం జగన్ తమ సేవలను, ఆవశ్యకతను గుర్తించి మాకు అనుకూలంగా మహిళా పోలీసు వ్యవస్థ, మహిళా పోలీసు చట్టం బలోపేతం చేసే దిశగా రూపకల్పన చేస్తారని, ప్రత్యేక మహిళా పోలీసు చట్టం తీసుకువస్తారని ఎన్నో ఆశయాలతో ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి ఉన్న మహిళా పోలీసులు ప్రస్తుతం నిస్సహాయతకు గురవుతున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో హోమ్ డిపార్ట్‌మెంట్‌కు మహిళా పోలీసులు అందిస్తున్న సేవలను గుర్తించి తమకు సరైన జాబు చార్టును రూపొందించాలని, తమను ఒక లైన్ డిపార్ట్‌మెంట్‌కు అనుసంధానించాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా పోలీసుల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్ పిఆర్కే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజక వర్గ మహిళా పోలీసులు టీ లక్ష్మి, తోట బ్యూల, సీహెచ్ నాగమణి, పి ఆనంద కుమారి, అందుగుల ఉషారాణి తదితరులున్నారు.

భూ ఆక్రమణలు తొలగించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ షేక్ కరిముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు

మాచర్ల రూరల్: జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణంలో జగనన్న లే అవుట్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆ ప్రాంతంలోనే రెవెన్యూ భూములు సర్వే జరిపి పట్టాలందించాలని మున్సిపల్ కౌన్సిలర్ షేక్ కరిముల్లా కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతి పత్రం అందించి ఆయన మాట్లాడారు. ఆజాద్ నగర్, వినాయకుని గుట్ట, జయంతి నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వానికి సంబంధించిన రెవెన్యూ భూమి ఎంతో ఉందని, ఈ భూమిలో కొందరు అక్రమాలకు పాల్పడి ఆక్రమించుకోవటమే కాక లే అవుట్లు వేసి విక్రయిస్తున్నారని, కొందరు నాపరాళ్ళతో గోడలు కట్టగా, మరికొందరు భూమిని సాగు పేరుతో భూ ఆక్రమణకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారి పై చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణ దారుల నుంచి భూమిని స్వాధీనపర్చుకొని బడుగు, బలహీన వర్గాలు, పేదలైన ప్రజలకు జగనన్న కాలనీ లేఅవుట్లు వేసి నిర్వాసితులకు భూ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీని పై స్పందించిన తహశీల్దార్ వెంటనే ఆర్ఐ, సర్వేయర్, వీఆర్ఓలను తీసుకెళ్ళి పరిశీలించి ఖచ్చితంగా ఆక్రమణదారుల నుంచి కాపాడి భూ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నీటిసరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో 600 ఎంఎం డీపీ రా వాటర్ పంపింగ్ లైనుకు మరమ్మతుల కారణంగా పట్టణంలో 02 తేదీ నుంచి 04 వ తేదీ సాయంత్రం వరకు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు తెలిపారు. మరలా 5వ తేదీ ఉదయం 6 గంటలకు నీటిని పునరుద్ధరించడం జరుగుతుందని తెలియజేశారు. దీనికి పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన తెలియజేశారు.